
# నన్నెత్తుక పోవె

మనిషి వయస్సులో వున్నప్పుడు రకరకాల వ్యవహారాలతో, వ్యాపకాలతో చేతినిండా పనుండి మరికాస్త పొద్దుంటే బాగుండుననిపిస్తుంది. అదే వయస్సు మళ్లినప్పుడు చేసేపని కనపడక ఈ పొద్దు ఇంకా గడవదేం అనిపిస్తుంటుంది. సరిగ్గా రాఘవరావు పరిస్థితి ఇలానే వుంది.



రాఘవరావు చాలకాలం పాటు ప్రభుత్వంలో మంచి హోదాలోనే ఉద్యోగం చేశాడు. అంతేకాదు! జీవితం - ఉద్యోగానికి, ఇంటికే పరిమితం కాలేదు. సాహిత్య, సంగీత, నృత్య, నాటక కళారంగాలపట్ల అతనికెంతో ఆసక్తి, అవగాహన వుండేది. సభలు, సమావేశాలు, ప్రదర్శనలకు క్రమం తప్పకుండా వెళ్తూ ఆనందిస్తూ వుండేవాడు.

ఉద్యోగం ఇచ్చిన ఊతంతో జీవితంలో బాగానే స్థిరపడగలిగాడు. పెళ్లి, పిల్లలు, బరువు బాధ్యతలు తనకు గుదిబండలని అతనెప్పుడూ అనుకోలేదు.

ముందు చూపుతో వ్యవహరించటం వల్ల ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాడు. పిల్లలిద్దరూ సెటిలయ్యారు. కూతురికి, అల్లుడికి హైదరాబాద్‌లో ఉద్యోగాలు. కొడుకు సివిల్ ఇంజనీర్. ఆర్ అండ్ బీలో మంచి హోదాలోనే వున్నాడు. తనూ, కొడుకూ కలిసే వుంటున్నారు.

రాఘవరావు జీవితంలో  సంభవించిన మొదటి విషాదం రిటైర్మెంట్! అతనెంతో క్రుంగిపోయాడు. అర్ధజీవితకాలం పాటు ఒకే జీవిత విధానానికి అలవాటుపడ్డ మనిషి ఆ వడిని, ఒడుపును కోల్పోయి కాళ్లూ, చేతులు కట్టేసుకుని ఎలా బ్రతకటం? నల్లేరు మీద నడకలా సాగుతున్న బ్రతుకుబండి దారి మళ్లటం కాదా?

క్లబ్బులకు వెళ్లి కాలక్షేపం చేయటానికి ప్రయత్నించాడు. పేకాట, లోకాభిరామాయణం తప్పితే ఎలాంటి నిర్మాణాత్మకమైన అంశాలు అక్కడ కనిపించక వెళ్లటం మానుకున్నాడు. దాంతో చాలవరకు పుస్తకాలే స్నేహితులయ్యాయి.

కొడుకు పిల్లలకు ఆసక్తికలిగించే కథలు చెప్పటం, ఆటలాడించటం, చదివించటంతో వాళ్ల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ శేషజీవితాన్ని అర్థవంతంగా మలచుకోవాలని తాపత్రయపడ్డాడు. అయితే రాఘవరావు చెప్పే నీతి కథలు పిల్లల చెవికెక్కటం లేదు. వాళ్ల దృష్టి టీ.వీ. ప్రోగ్రామ్‌ల మీదకు మళ్లింది. తాతయ్య ఒడి కన్నా టీ.వి.బాక్స్ బాగుంది. లెక్కలేనన్ని ఛానల్స్, ఆకర్షణీయమైన కార్యక్రమాల ముందు తాతయ్య ఇచ్చే వినోదం ఏపాటిది?

చదువులో ఒక్కో తరగతి పై కొస్తున్న కొద్దీ తమ చదువులో తాతయ్య ప్రమేయం వాళ్లకు నచ్చలేదు.

"మా క్లాసులో టీచర్ బాగానే చెప్తారు. మళ్లీ నువ్వేం చెప్పొద్దు. మేం చదువుకోగలం" అంటూ పిల్లలు అతని మీద చిరాకు పడటం మొదలెట్టారు.

"నాన్నా! వాళ్ల మానాన వాళ్లు చదువుకుంటారు. మీరేం కలగజేసుకోకండి" అన్నాడు సురేష్ సీరియస్‌గా. ఈ కాలం పిల్లలు, వాళ్ల అభిరుచులు, చదువులే వేరని రాఘవరావు సర్దిచెప్పుకున్నాడు.

రాఘవరావు జీవితంలో సంభవించిన రెండో విషాదం సత్యవతి మరణం! దెబ్బ మీద దెబ్బ! కడదాకా తోడుగా వస్తుందనుకున్న భార్య మధ్య దారిలో దిగిపోతే ఒంటరి

ప్రయాణం ఎంత దుర్భరమో రాఘవరావు అనుభవంలోకి వచ్చింది. ఇతరుల దయాదాక్షిణ్యాలతో తన అవసరాలు తీర్చుకోవలసి రావటం ఎంత బాధాకరం!

ఇంట్లో నలుగురి మధ్యా తను వుంటున్నాడన్నది పేరుకే గాని తనకెవరితోనూ సంబంధం వున్నట్లే అనిపించటంలేదు రాఘవరావుకి. పిచ్చాపాటిగా కొడుకు తనతో నాలుగు మాటలు మాట్లాడటమే కనాకష్టం. తను మాట్లాడించబోతే "ఆఁ! ఊఁ" అంటూ ముక్తసరి సమాధానాలు. అపరిచితుడితో మాట్లాడినట్లు పొడిమాటలు.

కోడలూ అంతే! "టిఫిను పెట్టాను", "భోజనం వడ్డించాను" అన్న పిలుపులు తప్పితే మాటలు వుండవు. రాఘవరావు డెబ్బై ఏళ్లపైబడి బ్రతికి వున్నందువల్ల ఒనగూడుతున్న ప్రయోజనం ఏపాటిది?

ఇరవై నాలుగ్గంటలూ పనీపాటూ ఏమీ లేకుండా కాళ్లూ, చేతులు కట్టేసుకుని ఎలా కూర్చోటం?

రాఘవరావు వార్తాపత్రికల్లో సాంస్కృతిక కార్యక్రమాల వివరాల గురించి తెలుసుకుని వెళ్తుండేవాడు. అక్కడ తెలిసిన ముఖాలెవరైనా తారసపడితే ప్రాణం లేసొచ్చేది. గతాన్ని స్మరించుకుంటూ ముచ్చటించుకోవటం మనసుకు ఆనందంగా వుండేది.

అయితే కార్యక్రమాలు ముగిసి ఇంటికి వచ్చే సరికి కాస్త పొద్దు పోతుండేది.

"ఈ వేళ దాకా ఇంటికి రాకుండా తిరుగుడేంటి మావయ్యా!" సరళ సన్నాయి నొక్కులు నొక్కసాగింది.

"నాకు కాస్త కాలక్షేపం వుండాలి గదమ్మా! తినాల్సిందేదో ఆ డైనింగ్ టేబుల్ మీద పడేసి వుంచు. నేనే పెట్టుకు తింటాను. నా గురించి నువ్వేం ఎదురుచూస్తూ వుండొద్దు" అంటూ కోడలికి చెప్పాడు.

అప్పటికి కోడలు మరేం మాట్లాడలేదు. కాని భర్తచేత తను చెప్పాలనుకున్నది గట్టిగానే చెప్పించింది.

"నాన్నా! వేళగాని వేళ ఈ తిరుగుళ్లేంటి! కాలో, చెయ్యో విరిగి మంచానపడితే చేసే వాళ్లెవరు? వయసును బట్టి ఆలోచన్లుండాలి, వ్యాపకాలుండాలి" మందలింపుగా అన్నాడు.

అంతే! రాఘవరావుకు మరో కార్యక్రమానికి వెళ్లటానికి మనస్కరించలేదు.

ఆ మధ్య జయరామయ్య కొడుకు బాలకృష్ణ ఉత్తరం రాశాడు. రాఘవరావు తమ్ముడు జయరామయ్య భీమవరంలో స్థిరపడ్డాడు. అతను చనిపోయి నాలుగేళ్లయింది.

జయరామయ్య చిన్నస్థాయి ఉద్యోగం చేసేవాడు. పిల్లల చదువులని, పెళ్లిళ్లని అనేక సందర్భాల్లో అడగకుండానే ఆర్థికంగా తమ్ముడికి సహాయపడ్డాడు. రాఘవరావు అది తన బాధ్యతగా భావించాడు.

బాలకృష్ణ ఉత్తరం రాఘవరావు గతజీవితంలోని భావోద్రేకాల్ని స్పృశించింది. తమ్ముడు, అతని పిల్లలు, తమ మధ్యవున్న అనుబంధం గుర్తొచ్చింది. భీమవరం వెళ్లి వారం రోజులపాటు వాళ్లతో గడిపి రావాలనిపించింది.

భీమవరం ప్రయాణం గురించి సురేష్‌కి చెప్పాలనుకోలేదు. చెప్తే వెళ్లవద్దంటాడని సరళకి చెప్పి బయల్దేరాడు.

"ఒక్క మాట ఆయనకు చెప్పకుండా వెళ్తున్నారు. వచ్చాక నన్ను ఎన్నంటారో" అన్నది కోడలు సణుగుతూ.

"ఇందులో వాడు నిన్ను అనటానికే ముందమ్మా! వాళ్లు అందరూ కళ్లల్లో మెదులుతున్నారు. వెళ్లాలనిపించింది. వెళ్తున్నాను. వారంరోజులపాటు నాకూ కాస్త కాలక్షేపం. ఒక్కడ్నే వెళ్లి రాలేకపోవటానికి నేనేం చిన్న పిల్లాడ్నా?" అంటూనే ప్రయాణమయ్యాడు.

రాఘవరావు రాకకు బాలకృష్ణ సంతోషం వ్యక్తపరిచాడు.

"నాకూ ఈ మధ్య తరచూ మీరు గుర్తొస్తున్నారు పెద్దనాన్నా! వద్దామంటే తీరిక దొరకటంలేదు. మీ ఆరోగ్యం బాగుంటుందా?" అన్నాడు.

"ఆఁ! వయస్సుతో పాటు వ్యాధులూ మీద పడటం మామూలే కదురా! బీ.పీ. వుంటుంది. ఏవో బిళ్లలువాడుతున్నాను" చెప్పాడు రాఘవరావు.

రాఘవరావు రాక తెలిసి జయరామయ్య రెండో కొడుకు హరికృష్ణ పరామర్శించటానికి భార్యతో వచ్చాడు. "నాన్న తర్వాత అంతటివాడివి! నిన్ను చూడటానికి మేమే రావల్సినవాళ్లం. మమ్మల్ని చూడాలన్న ఆపేక్షతో, ఇంత వయస్సులో ఓపిక చేసుకుని మరీ వచ్చావు. మాకు సిగ్గుగా వుంది" అంటూ ఎంతో ఇదయిపోయాడు హరికృష్ణ.

అన్నదమ్ములు తన పట్ల ఇంకా వెనుకటిలా చెక్కు చెదరని అభిమానంతోనే వున్నారనిపించి రాఘవరావు ఎంతగానో సంతోషపడ్డాడు.

"ఎటూ వచ్చాగా! ఇక్కడ నాలుగు రోజులు, అక్కడ నాలుగు రోజులు వుండే వెళ్తాలేరా! ఎటూ కదలక, మెదలక బుర్ర పాడయిపోతుందనిపించి ఇలా బయల్దేరొచ్చాను" అన్నాడు హరికృష్ణతో.

"అయ్యో! ఉదయం అందరం గుడివాడ వెళ్తున్నాం. మా తోడల్లుడి కూతురికి లగ్న నిశ్చయాలు. వెళ్తే రెండు మూడు రోజులుండక తప్పదు. రాక రాక నువ్వొస్తే ఊళ్లో లేకుండా పోవాల్సివచ్చింది". నొచ్చుకున్నాడు హరికృష్ణ.

"దాన్దేవుంది, వెళ్లండిరా! చెప్పా పెట్టకుండా వచ్చానాయే! మీ పనులు మీకుంటాయి. అందర్నీ చూడాలనుకున్నాను. కనపడ్డారు చాలు. ఒకసారి వీలు చూసుకుని రండ్రా!" అన్నాడు రాఘవరావు.

రాత్రి పెందలాడే భోంచేసి నిద్రకుపక్రమించాడు రాఘవరావు. ఒక కునుకుకూడా పట్టింది. ఒక రాత్రివేళ బాగా దాహం వేసి మెలకువ వచ్చింది.

తాగేందుకు నీళ్లు పెట్టమని చెప్పాడు. పెట్టటం మర్చిపోయినట్లున్నారు.

డైనింగ్ హాలులో లైటింకా వెలుగుతుంది. మాటలు సన్నగా వినబడ్తున్నాయి. బాలకృష్ణ ఇంటికి ఆలస్యంగా వచ్చాడు కాబోలు. భోజనం చేస్తున్నట్లున్నారు.

మంచినీళ్ళు తాగేందుకని రాఘవరావు మెల్లగా పడక దిగి గదిలో నుండి బయటికొచ్చాడు. హాల్లోకి నడిచాడు.

"పిలవని పేరంటంలా ఈ ముసలాయన వూడి పడ్డాడేంటి! ఇలా ఊళ్లంట తిరగటం తప్పించి వేరే పనేం లేనట్లుంది. ఎన్నాళ్లు తిష్ఠవేస్తాడో ఏమో! మీ తమ్ముడి తెలివి చూశారా! ఆ పిల్లకు లగ్నాలట. ముసలాయన్ని వదిలించుకోటానికి ఇదో ఉపాయం తోచినట్లుంది". బాలకృష్ణ భార్య మాటలు వినబడుతున్నాయి.

అతనేదో సంజాయిషీ ఇస్తున్నట్లున్నాడు. ఆ మాటలు వినటానికే మనస్కరించక వెనుదిరిగి గదిలోకి వచ్చాడు. తెల్లార్లూ సరిగా నిద్రపట్టలేదు.

మనస్సుకు సూదులు గుచ్చుకుంటున్నట్లు విలవిలలాడిపోయాడు.

రాఘవరావు ఉదయానే లేచి మళ్లీ తిరుగుప్రయాణమయ్యాడు.

"రాక రాక ఎన్నాళ్లకో వచ్చారు. నాలుగు రోజులన్నా వుంటారనుకుంటే అప్పుడే వెళ్తానంటారేం మావయ్యా!" తెగ బాధపడసాగింది బాలకృష్ణ భార్య.

"ఒక పూట భాగ్యానికి పడుతూ లేస్తూ మీరు రావటం దేనికి పెద్దనాన్నా! చూడాలనుందని కాకితో కబురంపితే మేమే వచ్చే వాళ్లం గదా!" సాగనంపుతూ ఎంతో అభిమానం ఒలకబోశాడు బాలకృష్ణ.

మనస్సులోని ఆలోచనలకు, నోటివెంట వచ్చే మాటలకు ఏ మాత్రం సంబంధం లేకుండా మాట్లాడే చాకచక్యం మనుషులకు ఎంత సులువుగా అలవడింది!

"అప్పుడే వచ్చారేంటి! ఊళ్లన్నీ తిరిగి చుట్టాల ఇళ్లన్నీ చక్కబెట్టుకొస్తారనుకున్నాను. మీ రాక కోసం అంతా ఎదురు సూసేవాళ్లేనాయె!" అంటూ సురేష్ మాటల్లో ఎంతో వెటకారం.

"పోనీండి! పెద్దాయన్ని పడనివ్వరన్న నిందలు, ప్రచారాలు లేకుండా పోతే అంతే చాలు!" అంటూ కోడలు సరళ మనసులోని తన అక్కసు వెళ్లగక్కింది.

రాఘవరావు జీవితం నాలుగ్గోడల మధ్య బందిఖానాలా అయిపోయింది. ఏ రోజు కారోజు కాలం గడవటం కష్టంగా వుంది. ఇంట్లో తన ఉనికి ఎవరికీ పట్టదు.

ఈ మధ్య తన ఈడుకు తగ్గ తోడొకరు దొరికారు. మార్నింగ్ వాక్‌కి వెళ్తుంటే తారసపడ్డాడు. కొడుక్కి బదిలీ అవటంతో అంతా ఈ ఊరొచ్చారట.

ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా ఒక చోట చేరి ముచ్చట్లాడుకునే వాళ్లు. ఖాళీగా వుండే ఒక బస్ షెల్టర్ వారికి కూడలి స్థలం అయింది. కలిసి వున్నంత సేపు ఎంతో ఆత్మీయుల్లా కబుర్లే కబుర్లు. కాలమంతా ఇలానే గడిచిపోతుంటే చాలనిపించేది ఇద్దరికీ.

క్రమం తప్పకుండా రోజూవచ్చే మనిషి ఒక రోజు రాలేదు. ఉదయం, సాయంత్రం అతని కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు రాఘవరావు. మూడు రోజులైనా అయిపు లేదు. రకరకాల ఊహాగానాలతో మనస్సు వ్యాకులపడసాగింది.

అతను చెప్పిన ఇంటి గుర్తుల్ని బట్టి జాడ వెతుకుంటూ వెళ్లాడు. ఇల్లు తెలుసుకోవటం పెద్ద కష్టం కాలేదు.

నిద్రలో మనిషి నిద్రలోనే గుండె పోటుతో కాలం చేశాడని ఇంట్లో వాళ్లు చెప్పారు. అదృష్టవంతుడనుకున్నాడు రాఘవరావు అతని గురించి

"మీరేమన్నా దూరపు బంధువులా, స్నేహితులా?" అంటూ ఆసక్తిగా ఆరాతీశారు ఇంటి వాళ్లు. ఏమని చెప్పాలి! బంధువా? స్నేహితుడా?

"వయో బంధం!" అంటూ సమాధానం చెప్పి లేచి వచ్చేశాడు రాఘవరావు.

నెల రోజులపాటు ఇల్లు కదలలేదు రాఘవరావు. ఓ రోజు సత్యవతి తరపు బంధువుల్నుండి పెండ్లి శుభలేఖ వచ్చింది. సురేష్ వారి ఆహ్వానాన్ని అంతగా పట్టించుకున్నట్లు లేదు. కాని రాఘవరావు అలా వుండలేకపోయాడు.

సత్యవతితో పెళ్లి చూపులకని వెళ్లింది ఆ ఊరికే. సత్యవతితో పెళ్లి జరిగింది ఆ ఊళ్లోనే! వివాహపు తొలి రోజుల ముచ్చట్లు తీరిందీ అక్కడే! పిల్లలు కలిగిందీ,

తప్పటడుగులు వేసిందీ అక్కడే! ఆ ఊరెళ్తే, అప్పటి మధురస్మృతుల్ని జీవిత చరమాంకంలో మరోసారి మననం చేసుకునే భాగ్యం కలుగుతుంది.

దూరాభారం అయితేనేం, ఎంత కష్టం భరించయినా వెళ్లి రావాలనే రాఘవరావు నిశ్చయించుకున్నాడు.

రాఘవరావు ప్రయాణ సన్నాహం సరళ భర్తకు చెప్పింది.

“శుభమా అంటూ వాళ్లు పెళ్లి చేసుకుంటుంటే తగుదునమ్మా అని మీరెందుకు వెళ్లటం? పెళ్లిళ్లనీ, పేరంటమనీ ఊళ్లు బట్టుకు తిరిగే వయసామీది? ఈ వయసులో ఏ క్షణాన ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? వేళకాని వేళ, ఊరుగాని ఊర్లో, జరగరానిది జరిగి ప్రాణం గుటుక్కుమంటే ఎంత అప్రదిష్ట? మీకేం మీరు హాయిగా పోతారు. ఆ తర్వాత మేం ఎన్ని ఇబ్బందులు పడాలి! పెద్దాయన సరే, కాటికి కాళ్లు జాపుకు కూర్చోవలసిన వయసులో, ఊళ్లంట పంపటానికి కొడుక్కెలా బుద్ధిలేకపోయిందని నన్నాడిపోసుకుంటారు. ఈ వయసులో మీ సౌకర్యాల గురించి కాదు ఎదుటి వాళ్లకు మీ వలన కలిగే అసౌకర్యాల గురించి ఆలోచించాలి. ఇదంతా, మీకుగా మీరే అర్థం చేసుకుని ఏదో రామా, కృష్ణా అనుకుంటూ ఇంట్లో పడుండాలి” అంటూ ఇంతెత్తున లేచాడు తండ్రి మీద సురేష్.

ఆ మాటలకు రాఘవరావుకు నోటమాటరాలేదు. నిలువు గుడ్లేసుకుని కొడుకువంక చూస్తుండిపోయాడు.

కళ్లల్లో జీవకళ ఒక్కసారిగా ఇంకిపోయినట్లయింది. అతని ముఖంలో చావు గురించిన ఆందోళన, భీతి మొట్టమొదటిసారి కనిపించాయి. మృత్యుముఖంలో నిలబడున్నట్లు నిలువెల్లా కంపించసాగాడు రాఘవరావు.

*(స్వాతి సపరివార పత్రిక. 23.07.1999)*